




RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం








కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 270 శనివారం, అక్టోబర్ 17 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com


# ‘వ్యవసాయ పాడి పంటలు’ విడుదలలో జాప్యం..

## వాట్సాప్ సమాచారంతోనే సరిపెడుతున్నారన్న ఆరోపణలు

- అక్టోబర్ 15 దాటినా రైతులకు అందని వ్యవసాయ సంచిక
- ప్రధాన సంపాదకుడిగా డైరెక్టర్ గోపీ, సంపాదకులుగా అదనపు సంచాలకులు విజయ్ కుమార్, నర్సింహారావు..
- ప్రతి నెల అదే తంతు...
సీఎం రేవంత్ జారా డెకో....




(జోర్దార్ అగ్రికల్చర్ హైదరాబాద్ బ్యూరో చీఫ్)
రైతులకు సీజన్‌కు అనుగుణమైన సాగు సూచనలు, ఆధునిక సాంకేతిక సమాచారం, పంటల సంరక్షణ పద్ధతులు, ప్రభుత్వ పథకాల వివరాలు అందించే వ్యవసాయ పాడి పంటలు సంచిక అక్టోబర్ నెలలో ఇప్పటివరకు విడుదల కాలేదు. నెలలో సగం గడిచినా సంచిక అందుబాటులోకి రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముద్రిత సంచికను సకాలంలో అందించకుండా వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని పంపడానికే అధికారులు పరిమితమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### సాగు కీలక దశలో రైతులకు అందని మార్గదర్శకాలు

ప్రతి నెలా ఆయా కాలాల్లో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు, పంటల యాజమాన్య పద్ధతులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సంచికలో ప్రచురిస్తారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌తో పాటు వ్యవసాయ కార్యాలయాల్లో ఉచితంగా అందుబాటులో ఉండాల్సిన పత్రిక అక్టోబర్ 15వ తేదీ దాటినా రైతులకు చేరలేదు. అక్టోబర్‌లో చేపట్టాల్సిన సాగు పనులు, పంటల సంరక్షణ, నీటి వినియోగం, తెగుళ్ల నియంత్రణ వంటి అంశాలపై సకాలంలో సమాచారం అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగు నిర్ణయాలు తీసుకునే కీలక సమయంలో సంచిక విడుదల కాకపోవడం వ్యవసాయ సమాచార వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

### ముద్రిత సంచికకు బదులు వాట్సాప్ ప్రచారమేనా?

రైతులకు అధికారికంగా అందాల్సిన సంచికను విడుదల చేయకుండా వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని పంపడానికే అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అన్ని ప్రాంతాల రైతులు వాట్సాప్ గ్రూపులకు అనుసంధానమై ఉండకపోవడంతో, ఈ విధానం ద్వారా సమగ్రంగా సమాచారం చేరడం లేదని రైతులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ముద్రిత సంచికలు, వ్యవసాయ కార్యాలయాల ద్వారా సమాచారం అందించడం ఇప్పటికీ అవసరమని వారు పేర్కొంటున్నారు.

### సంచిక విడుదల జాప్యంపై రైతుల అసంతృప్తి

ఈ సంచికకు ప్రధాన సంపాదకుడిగా డైరెక్టర్ గోపీ, సంపాదకులుగా అదనపు సంచాలకులు విజయ్ కుమార్, నర్సింహారావు వ్యవహరిస్తున్నరు. రైతులకు నేరుగా ఉపయోగపడే సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, సంచిక విడుదలలో జాప్యం జరగడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ సంచికను వెంటనే విడుదల చేసి వ్యవసాయ కార్యాలయాలు, ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. భవిష్యత్తులో ప్రతి నెలా సంచికను నిర్ణీత తేదీలో విడుదల చేసేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో అర్ధరాత్రి నాకాబందీ..

## అదుపులో 48 మంది



హైదరాబాద్, అక్టోబర్16: నగరంలో గత అర్ధ రాత్రి ‘ఆపరేషన్ కవచ్’ పేరిట పోలీసులు ప్రత్యేక నాకాబందీ నిర్వహించినట్లు పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్‌లో తెలిపారు. దాదాపు 100కుపైగా బృందాలతో ప్రత్యేక నాకాబందీ నిర్వహించామని చెప్పారు. 3 వేల మంది పోలీసులతో విస్తృత తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో 725 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే 48 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఈ ఆపరేషన్ కవచ్‌లో 5 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇక ఈ తనిఖీల్లో ఓ ఆయుధం స్వాధీనం చేసుకోగా.. రెండు గంజాయి కేసులు నమోదు చేశామని చెప్పారు. అయితే ఈ తనిఖీల్లో అత్యధికంగా గోల్కొండ జోన్‌లో సరైన పత్రాలు లేని 213 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. జూబ్లీహిల్స్ జోన్‌లో 18 వాహనాలు డిటైన్.. 8 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నంబర్ ప్లేట్లు తారుమారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వాహనదారులను హెచ్చరించారు. నంబర్ ప్లేట్లను స్పష్టంగా ఉంచుకోవాలంటూ వాహనదారులకు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు.

# ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.

## 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు



హైదరాబాద్: తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన ‘చేతకాని కరవు’ అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎం సీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

# కరీంనగర్ జీజీహెచ్‌లో అస్తవ్యస్త పాలన..

## అత్యవసర విభాగాల్లో డిప్యూటేషన్ పెత్తనం!




కరీంనగర్ జోర్దార్ నిఘా విభాగం
కరీంనగర్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పరిపాలన గాడి తప్పిందని, అధికారుల పర్యవేక్షణ లోపం, డిప్యూటేషన్ సిబ్బంది ఆధిపత్యం కారణంగా ఆసుపత్రి సేవలు, నర్సింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీ, ఐసీయూ, మాతా శిశు విభాగంలోని ప్రధాన లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్ వంటి అత్యవసర విభాగాల బాధ్యతలను ఇక్కడే రెగ్యులర్‌గా పనిచేస్తున్న వైద్య విద్యా సంచాలకుల పరిధిలోని సీనియర్ నర్సింగ్ అధికారులకే అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. టీవీవీపీ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బంది చేతుల్లో అత్యవసర విభాగాల బాధ్యతలు ఉండటంతో పరిపాలనలో స్థిరత్వం దెబ్బతింటోందని ఆరోపిస్తున్నారు. డిప్యూటేషన్ సిబ్బంది ఎప్పుడైనా మాతృశాఖకు వెళ్లే అవకాశం ఉండటంతో అత్యవసర వైద్య సేవలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. అందువల్ల డీఎంఈ పరిధిలోని రెగ్యులర్ సీనియర్ నర్సింగ్ అధికారులకే కీలక విభాగాల పూర్తి బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు.

### క్యాజువాలిటీ నిర్వహణపై తీవ్ర ఆరోపణలు

క్యాజువాలిటీలో సీనియర్ వైద్యులు విధుల్లో ఉన్నప్పటికీ జూనియర్ వైద్యులతోనే అత్యవసర వైద్యం చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఆగస్టులో గుండెనొప్పితో క్యాజువాలిటీకి వచ్చిన 25 ఏళ్ల యువకుడికి సరైన వ్యాధి నిర్ధారణ చేయకుండా సాధారణ నొప్పిగా భావించి పంపించారని, మరుసటి రోజే ఆ యువకుడు మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఓపీ ఫార్మసీ సమయం పెంచాలని డిమాండ్

ఆసుపత్రి ఓపీ ఫార్మసీ మధ్యాహ్నం 2 గంటలకే మూసివేయడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. రోగుల సౌకర్యార్థం ఫార్మసీ సేవలను సాయంత్రం 6 గంటల వరకు కొనసాగించాలని కోరుతున్నారు.

### సూపరింటెండెంట్ విదేశీ పర్యటనపై ప్రశ్నలు

ఆసుపత్రి సూపరింటెండెంట్ అనుమతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా ఆసుపత్రి పరిపాలనపై సరైన పర్యవేక్షణ లేదని ఆరోపిస్తూ, విదేశీ పర్యటనకు సంబంధించిన అనుమతులు, విధి నిర్వహణ అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

### టీవీవీపీ అధికారుల ఆధిపత్యంపై ఆరోపణలు

టీవీవీపీకి చెందిన ఆర్ఎంఓతో పాటు కొందరు సీనియర్ నర్సింగ్ అధికారులు ఏళ్ల తరబడి ఒకే ఆసుపత్రిలో కొనసాగుతూ రాజకీయ అండతో ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వీరి పెత్తనం కారణంగా డీఎంఈ పరిధిలోని నర్సింగ్ గ్రేడ్-1, గ్రేడ్-2 అధికారులు సైతం ఒత్తిడికి గురై ప్రశ్నించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న సంబంధిత అధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి పరిపాలనలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

### నైట్ డ్యూటీ రోస్టర్‌లో అక్రమాల ఆరోపణలు

నైట్ డ్యూటీల కేటాయింపులో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరికి మినహాయింపులు ఇస్తూ, ప్రశ్నించే జూనియర్ నర్సింగ్ అధికారులతో పాటు ఇతర నర్సింగ్ సిబ్బందికి వరుసగా నైట్ డ్యూటీలు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనివల్ల సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, డ్యూటీ రోస్టర్‌ను పారదర్శకంగా అమలు చేసి అందరికీ సమాన న్యాయం చేయాలని కోరుతున్నారు.

### ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్

కరీంనగర్ జీజీహెచ్‌లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం, వైద్య విద్యా సంచాలకుల ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర విభాగాల బాధ్యతలను డీఎంఈ రెగ్యులర్ సీనియర్ నర్సింగ్ అధికారులకే అప్పగించడం, క్యాజువాలిటీలో సీనియర్ వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం, యువకుడి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపడం, ఓపీ ఫార్మసీ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పొడిగించడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే టీవీవీపీ డిప్యూటేషన్లను సమీక్షించి, ఏళ్ల తరబడి ఒకే చోట కొనసాగుతున్న అధికారులను బదిలీ చేయడంతో పాటు నైట్ డ్యూటీ రోస్టర్‌ను పారదర్శకంగా అమలు చేసి నర్సింగ్ సిబ్బందిపై ఒత్తిడిని అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# స్థానిక సమరానికి టీడీపీ సై..

## అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పక్కా వ్యూహం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ, సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం పార్టీ వద్ద ఉన్న సమాచారంపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరిస్తున్నారు. అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజామోదం, నాయకత్వ లక్షణాలు, సేవా నిబద్ధత వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీకి సంబంధించి లోతైన విశ్లేషణ జరుపుతూ వడపోత కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నారు. ఈసారి మేయర్లు, మునిసిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండటంతో అభ్యర్థుల ఎంపిక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో కేవలం పార్టీ కేడర్‌లోనే కాకుండా ప్రజల్లో మంచి పేరున్న, బలమైన అభ్యర్థులకే పట్టం కట్టాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ప్రత్యక్ష అంచనాతో అన్ని కోణాల్లో ఆలోచించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# ప్రభుత్వ- పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో డిప్యూటేషన్లముసుగులో లంచాల దందా

( హైదరాబాద్ వరంగల్ నిజామాబాద్ జోర్దార్ బృందం)




**1. ఫిర్యాదు సారాంశం ఏమిటి:**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలలో బదిలీలు పూర్తయిన వెంటనే మళ్లీ అడ్డగోలుగా తాత్కాలిక పని ఆదేశాలు జారీ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కొందరు ఉన్నతాధికారులు ఒక ఉద్యోగి నుండి లక్ష రూపాయల వరకు లంచం తీసుకుని, తమకు ఇష్టమైన హైదరాబాద్, వరంగల్ నగరాలకు పంపిస్తున్నారని, దీని వల్ల వెనుకబడిన ప్రాంతాల్లోనిసంస్థలుఖాళీఅయి విద్యార్థులు నష్టపోతున్నారని ఫిర్యాదు.

**2. హేతుబద్ధీకరణ లేకపోవడమే అసలు కారణం:**
రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో హేతుబద్ధీకరణ జరగలేదు. దీంతో కొన్ని సంస్థల్లో ఎక్కువ ఉద్యోగులు ఉండగా, మరికొన్నింటిలో చాలా తక్కువ మంది ఉన్నారు. ఈ అసమానతను అదునుగా చేసుకుని, హైదరాబాద్ మరియు వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకుల పరిధిలోని అధికారులు ఇష్టారాజ్యంగా తాత్కాలిక ఆదేశాలు ఇస్తున్నారు.

**3. నిజామాబాద్ పాత సంస్థలో ఆశ్చర్యకర పరిణామం:**
వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకుల పరిధిలోని నిజామాబాద్ పాత పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఐదు సాంకేతిక సహాయక ఉద్యోగాలు ఉన్నాయి. లిఇటీవల పదోన్నతిపై ఐదుగురు అక్కడికి వచ్చారు. ఇదే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వచ్చిన వెంటనే అందులో ఇద్దరు వ్యక్తులు మళ్లీ పదోన్నతి పొంది తాత్కాలిక ఆదేశాలపై వెళ్లిపోయారు. ఒకరు పెద్దపల్లి సంస్థకు, మరొకరు మనోజ్ కుమార్ అనే వ్యక్తి వరంగల్ సంస్థకు వెళ్లడంతో, నిజామాబాద్ పాత సంస్థలో విద్యుత్ పని నేర్పే వారే లేకుండా పోయారు.
బోధించే నాథుడే కరువయ్యాడు. రాగానే వెళ్లిపోవడం వెనుక భారీ లంచం దందా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**4. విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం:**
హైదరాబాద్ లోని ఉపాధి శిక్షణ శాఖ అధికారులు బదిలీలు అయ్యాక మళ్లీ తాత్కాలిక ఆదేశాలు వేయడం వల్ల చాలా సంస్థల్లో పాఠాలు జరగడం లేదు.లి ప్రయోగశాలలు నడవడం లేదు. సహాయ శిక్షణాధికారులు, శిక్షణాధికారులు తమ స్వార్థం కోసం ప్రాంతీయ సంచాలకులను తప్పుదోవ పట్టించి, ప్రధానాచార్యులకు లంచాలు ఇచ్చి బలవంతంగా తాత్కాలిక ఆదేశాలు పొందుతున్నారు.వరంగల్, హైదరాబాద్ జిల్లాలు తప్ప మిగతా చాలా జిల్లాల్లో ఉద్యోగాల ఖాళీలు ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ చదివే విద్యార్థులకు పాఠ్య ప్రణాళిక పూర్తి కావడం లేదు, ప్రయోగాలు దొరకడం లేదు, సిద్ధాంత తరగతులు జరగడం లేదు. దీంతో వారి నైపుణ్యాలు లోపిస్తున్నాయి.

**5. మా ప్రధాన డిమాండ్లు:**
అ) వరంగల్, హైదరాబాద్ ప్రాంతీయ ఉప సంచాలకుల పరిధిలో జారీ చేసిన అన్ని అక్రమ తాత్కాలిక పని ఆదేశాలను వెంటనే రద్దు చేయాలి.
ఆ) లంచాలు తీసుకుని ఆదేశాలు ఇస్తున్న ఉన్నతాధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.ఇ) రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో వెంటనే హేతుబద్ధీకరణ చేపట్టాలి.ఈ) ఖాళీగా ఉన్న గ్రామీణ ప్రాంత సంస్థలకు సిబ్బందిని పంపి, విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠాలు, ప్రయోగాలు అందేలా చూడాలి.

# డీడీలతో టీఏ వసూళ్లు.. ఉద్యోగులకు రావాల్సిన భత్యాలు మాత్రం బంద్!




వరంగల్ జోర్దార్ నిఘా విభాగం

జిల్లా సంక్షేమ కార్యాలయంలో ఇటీవల ఏడుగురు సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే, వారు గతంలో ప్రయాణాలు చేయలేదని, అనవసరంగా ప్రయాణ భత్యాలు పొందారనే కారణాలతో వారి నుంచి డీడీల రూపంలో ఆ మొత్తాలను తిరిగి వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు విధి నిర్వహణలో భాగంగా వాస్తవంగా చేసిన ప్రయాణాలకు సంబంధించిన ప్రయాణ భత్యం(టీఏ) బిల్లులను మాత్రం ఇప్పటివరకు చెల్లించకపోవడం పట్ల బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.క్షేత్రస్థాయి పరిశీలనలు, ఇతర కార్యాలయ పనుల నిమిత్తం ఆన్‌డ్యూటీలో భాగంగా సొంత ఖర్చులతో ప్రయాణాలు చేసిన ఉద్యోగులకు రావాల్సిన టీఏ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వారు చెబుతున్నారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా సంక్షేమ అధికారి(డీడబ్ల్యూఓ)ను కలిసి తమకు రావాల్సిన ప్రయాణ భత్యాలను చెల్లించాలని విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.ఒకవైపు ఉద్యోగాల నుంచి తొలగించి, మరోవైపు విధి నిర్వహణలో చేసిన ప్రయాణాలకు సంబంధించిన ఖర్చులు చెల్లించకుండా నిలిపివేయడం వల్ల తమపై ఆర్థిక, మానసిక భారం పెరుగుతోందని బాధితులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న టీఏ బిల్లులను చెల్లించాల్సిన అవసరం ఉన్నప్పటికీ జాప్యం చేయడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖాధికారులు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులను పరిశీలించాలని బాధిత ఉద్యోగులు కోరుతున్నారు. అర్హత ఉన్న మొత్తాలను వెంటనే మంజూరు చేయడంతో పాటు, డీడీల రూపంలో వసూ లు చేసిన మొత్తాలు, చెల్లించాల్సిన టీఏ బిల్లులపై సమగ్రంగా జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా విజయదశమి వేడుకలు

- నిర్వహించిన ఆలయ అర్చకులు గంగుల సత్యనారాయణ




**సిర్పూర్(టి ):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం వేలాది భక్తుల ఆధ్వర్యంలో.గరుడ వాహనము ఊరేగింపు నిర్వహించినారు. విజయ దశమి నవరాత్రుల సందర్భంగా. ఆలయంలో. ప్రతిరోజు ఘనంగా పూజలు నిర్వహించి భజన కీర్తనలతో భక్తులు. రథంలో గరుడ వాహనం తిలకించి పల్లకి ఎత్తుకొని ఊరేగింపు చేసినారు. భక్తులు చాలామంది పాల్గొని గరుడ వాహనము పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. విజయ దశమి సందర్భంగా.శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో,ప్రతి సంవత్సరం.గంగుల సత్యనారాయణ అర్చకుల ఆధ్వర్యంలో.ఆలయ కమిటీ పర్యవేక్షణలో. ఘనమైన పల్లకి మహోత్సవాలు నిర్వహిస్తారు. అందులో.భాగంగా.గురువారం ఘనంగా భక్తులు.పూజలు. నిర్వహించి. గరుడ వాహన పల్లకి మోసినారు ఈ కార్యక్రమంలో అర్చకులు గంగుల సత్యనారాయణ వేదమంత్రాలు చదివి. దేవునికి అర్చనలు చేసి.
భక్తులకు దేవుని ప్రసాదాలు అందించి ఆశీర్వదించినారు.
మహోత్సవ కార్యక్రమంలో సిర్పూర్ మండలంలోని పలు గ్రామాలనుండి. భక్తులు పెద్ద ఎత్తున.పాల్గొని పూజలు నిర్వహించినారు.

# ఆదిలాబాద్‌లో ఘనంగా సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ ఆవిర్భావ దినోత్సవం



**ఆదిలాబాద్,** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ ఆవిర్భావ దినోత్సవ, ఆర్టిఐ వారోత్సవాలు భాగంగా వృద్ధాశ్రమంలో పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సమాచార హక్కు రక్షణ చట్టం 2005 తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో నిరంతరము గ్రామ స్థాయి వరకు సహా చట్టం పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలను చైతన్య వంతం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సహచట్టం పై గల సందేహాలను నివృత్తి చేస్తూ, దరఖాస్తు విధానాలను తెలుపుతూ సహకరిస్తూ, ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు మధ్యనా వారధిగా ఉంటూ సహా చట్టం పకడ్బందీగా అమలు కావడానికి ప్రభుత్వ అధికారులతో కలిసి తమ సొసైటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు రక్షణ చట్టం సొసైటీ జిల్లా స్టూడెంట్ వింగ్ కన్వీనర్ రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షులు భూమన్న తదితరులు పాల్గొన్నారు.

# దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు

- సాలూరు డిపో మేనేజర్ పొడుగు విశ్వ సుందర శ్రీనివాస్ వెల్లడి




**పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు టౌన్,**
దసరా పండుగ రద్దీ దృష్టిలో ఉం చుకొని ప్రస్తుతం సాలూరు నుండి విశాఖపట్నం నడుస్తున్న 22 బస్సుల తో పాటు అదనంగా ఆరు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్టు సాలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పొడుగు విశ్వ సుందర శ్రీనివాస్ తెలిపారు. అంతేకాకుండా సాలూరు మీదుగా విజయనగరం వరకు 12 ప్రత్యేక బస్సులను పండుగ వేళ నడుపుతున్నట్టు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు సౌకర్యాలు అందించడం తమ బాధ్యతగా పేర్కొన్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ,డోర్లు వద్ద వేలాడుతూ ప్రయాణం చేయరాదని, "నిదానమే ప్రధానం" అనే సూత్రాలు పాటించి ప్రయాణాన్ని ఆనందకరంగా మధురా నుభూతుల ఉండాలని ఆయన హితవు పలికారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో మెండెం కిరణ్ కుమార్

**ఖమ్మం, :** నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో రైట్ ఛాయిస్ ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ మెండెం కిరణ్ కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతు న్నారు.గతంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు పోటీ పరీక్షల శిక్షణ అందించిన అనుభవంతో పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తానని కిరణ్ కుమార్ చెబుతున్నారు.

డబ్బు, ప్రలోభాలకు కాకుండా పట్టభద్రుల విశ్వాసం, నిరుద్యోగుల మద్దతుతో లక్షన్నర ఓట్లు సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.
ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాలతో పాటు ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాల్లోనూ ఓటరు నమోదు కార్యక్రమాల ద్వారా పట్టభద్రులను చేరుకునే ప్రయత్నం చేస్తున్నారు.
మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా, ఇతర ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికపైనా రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మెండెం కిరణ్ కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా చేపడుతున్న కార్యక్రమాలు, పట్టభద్రుల నుంచి లభించే స్పందనపై ఆసక్తి నెలకొంది.



# జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి



- టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు బాపురావు, గాదె కరుణాకర్‌రావు డిమాండ్

**కరీంనగర్,జోర్దార్ ప్రతినిధి:**పత్రికల్లో వార్తా కథనాలు ప్రచురించిన జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్‌రావు డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ శేఖర్‌లను శుక్రవారం పరామర్శించి ఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంభీరావుపేట ఎస్‌ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై వార్తలు ప్రచురించినందుకు జర్నలిస్టులపై ప్రతీకార చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. పోలీసుల అదుపులో చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని కోరారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

పోలీసుల అదుపులో ఉన్న సమయంలో మొబైల్ ఫోన్లు తీసుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఆలస్యంగా అందిందని బాధితులు తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. ఘటనలో బాధ్యులెవరో, ఎవరి ఆదేశాలతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయో స్వతంత్రంగా విచారించాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు నరేష్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వాణిజ్య సెల్ జిల్లా అధ్యక్షుడిగా తాటిపల్లి రాజన్న



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా తాటిపల్లి రాజన్న నియమితు లయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ రాజన్నకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని పనిచేసే వారికి సముచిత గుర్తింపు, బాధ్యతలు కల్పిస్తామని తెలిపారు. జిల్లాలోని వ్యాపారులు, వాణిజ్య సముదాయాల నాయకులతో సమన్వయం చేసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాజన్నకు సూచించారు. వ్యాపారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

నూతనంగా నియమితులైన తాటిపల్లి రాజన్న మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మంత్రులకు, జిల్లా పార్టీ నాయకత్వానికి, వొడితల ప్రణవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపార, వాణిజ్య రంగాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దుర్గామాతను దర్శించుకున్న చైర్ పర్సన్ సుహాసిని మనోజ్ రావు



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో దుర్గామాత అమ్మవారిని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దుర్గామాత పూజలను భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. దుర్గామాత అమ్మవారి కరుణాకటాక్షాలు హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దుర్గామాత ఉత్సవాలను భక్తి, ఐక్యత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్, సొల్లు సునీత బాబు, మంచికట్ల ప్రశాంతి మురళి, వార్డు ప్రజలు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పరిశీలించిన కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్



**హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:**వర్ధన్నపేట శాసనసభ్యుడు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని హసన్‌పర్తి 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ అధికారులతో కలిసి బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు.

డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు వద్ద బతుకమ్మ ఆడుకునే స్థలం, లైటింగ్ సౌకర్యాలు, గుంతలమయంగా ఉన్న రోడ్డు, చెట్ల పొదలు, చెన్నంగి చెరువు కట్టను సందర్శించారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా హసన్‌పర్తి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ వేడుకలు జరుపుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

## ఆర్థికంగా వెనుకబడిన ఓసీలకు రిజర్వేషన్లు కల్పించాలి




- కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- ఓసీ జేఏసీ నాయకుల డిమాండ్

**చొప్పదండి,జోర్దార్ ప్రతినిధి:**ఆర్థికంగా వెనుకబడిన పేదలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెంద్యాల రాంరెడ్డి, రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు.

శుక్రవారం చొప్పదండిలో ఏనుగు చొక్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఓసీ ఐకాఓస, రెడ్డి జేఏసీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని సామాజిక వర్గాల్లోని పేదల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసేందుకు చట్టబద్ధమైన ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. తాము ఏ కులానికీ, మతానికీ వ్యతిరేకం కాదని, అన్ని వర్గాల పేదలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సామాజిక ఉద్యమకారుడు ప్రవీణ్ అరోరా చేపట్టిన దేశవ్యాప్త బస్సు రథయాత్రకు ఓసీ, రెడ్డి జేఏసీలు, బహుజన కుల సంఘాల జేఏసీ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా రథయాత్ర గోడపత్రాలను పోలాడి రామారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొమర ఎల్లారెడ్డి, రూప్ రెడ్డి, స్కైలాబ్ రెడ్డి, కేతిరి మణిశంకర్ రెడ్డి, గన్ను నర్సింహారెడ్డి, గుర్రం అంజిరెడ్డి, జంపాల నర్సయ్య, బచ్చు ఆనందం, తాళ్లపల్లి కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

## 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే రెండో పీఆర్సీ ప్రకటించాలి



- కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్

**కరీంనగర్,జోర్దార్ ప్రతినిధి:**తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులకు వినతి పత్రం పంపినట్లు తెలిపారు.

ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవులు, జీపీఎఫ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద హెల్త్ కార్డు పరిమితిని రూ. 10 లక్షలకు పెంచి, అన్ని ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## హుజురాబాద్ ప్రజల సంక్షేమం కోసం చండీ హోమం



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఆయన సతీమణి షాలిని రెడ్డి చండీ హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, సిరిసంపదలతో ఉండాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేత



- అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సహాయం

**రామగిరి జోర్దార్ :**పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ఆదివారంపేట గ్రామానికి చెందిన కన్నూరి మైసయ్య ఈ నెల 6న మృతి చెందారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించిన అమ్మ స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ముందుకొచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం మైసయ్య దినకర్మ సందర్భంగా ఆయన భార్య,ముగ్గురు కుమార్తెలను పరామర్శించి, కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. అనంతరం అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో అమ్మ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కన్నూరి బాపు, కన్నూరి రాజయ్య (ఫీల్డ్ అసిస్టెంట్), కన్నూరి నాగేష్, కన్నూరి రాజు (జర్నలిస్ట్), కన్నూరి మోహన్, కన్నూరి రాజేష్, కాంపెల్లి అరుణ్ కుమార్, కన్నూరి సారయ్య,గోడిశేల లింగయ్య, గోడిశేల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## బోర్నపల్లిలో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన చైర్‌పర్సన్ సుహాసిని



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పరిశీలించారు. మహిళలు పండుగను ఘనంగా జరుపుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాంపల్లి శ్రీనివాస్, వజ్జపల్లి వెంకటేశ్వర్లు, చందమల్ల పుణ్యబాబు, మొగిలి, సునీత బాబు, మున్సిపల్ సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.

## ఎలినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కోవాలి



**వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:**ప్రకృతి విపత్తుగా భావిస్తున్న ఎలినో ప్రభావాన్ని రాష్ట్ర ప్రజలందరూ సమి ష్టిగా ఎదుర్కోవాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు.

ప్రజలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరా రు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 97 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.97,11,252 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుష్ఠువ్యాధి గుర్తింపునకు ఇంటింటి సర్వే




**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:** కుష్ఠువ్యాధి నిర్మూలన లక్ష్యంగా అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు 14 రోజుల పాటు గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్ర పర్యవేక్షణ అధికారి డాక్టర్ జరీన భాను ఏర్పాట్లను పరిశీలించి, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించాలని అధికారులకు సూచించారు. ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. చర్మంపై రంగు మారిన మచ్చలు, స్పర్శజ్ఞానం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని అధికారులు సూచించారు.

కుష్ఠువ్యాధికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చికిత్స అందుబాటులో ఉందని, వ్యాధిపై అపోహలు వీడి బాధితుల పట్ల వివక్ష చూపవద్దని కోరారు.

# టీఎస్‌జీఆర్ఈఏ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పెరుక నాగమోహన్




**కరీంనగర్,జోర్దార్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్ఈఏ) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పెరుక నాగమోహన్ ఎంపికయ్యారు. కరీంనగర్ పెన్షనర్స్ భవన్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఉస్మాన్ పాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగమోహన్ బాధ్యతలు స్వీకరించారు.
తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు నాగమోహన్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా యూనిట్లను సమన్వయం చేసుకుంటూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఉస్మాన్ పాషా నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి పొలాస రామచంద్రము, ప్రచార కార్యదర్శి శ్రీధర్ రావు, రాష్ట్ర కౌన్సిలర్లు చోటేమియా, రాజేంద్రప్రసాద్, హుజురాబాద్ మండల శాఖ అధ్యక్షుడు జయవర్ధన్, సీనియర్ కార్యకర్త పోరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ



- రికార్డులు,నివేదికల నిర్వహణపై సంతృప్తి లిప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
- డాక్టర్ ఏ అప్పయ్య

**కమలాపూర్,జోర్దార్ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కనిపర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల రికార్డులు, నివేదికలను పరిశీలించి,వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.కనిపర్తి పల్లె దవాఖానలో కుక్కకాటు నివారణకు రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు టెటనస్ (టీటీ) టీకా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను వినియోగించు కోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆరోగ్య మందిరం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, హెచ్ఈఓ సీహెచ్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, టీబీ నోడల్ పర్సన్ తౌటం ప్రభాకర్, లావణ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ లేని పిల్లలకు ప్రత్యేక డెస్క్

**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాలలో ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేని పిల్లలకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.

శుక్రవారం వెబెక్స్ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఎస్పీ, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.
అర్హులైన పిల్లలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుసూదన్, నర్సింగరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# విద్యుత్ సంక్షోభంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:** తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ రంగం ప్రస్తుత పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.హుజురాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందనివిమర్శించారు.రైతులకు సకాలంలో విద్యుత్ అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉత్పత్తి, కొనుగోళ్లు, పంపిణీ వ్యయాలు, సరఫరాలో అంతరాయాలకు గల కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలని కోరారు. అలాగే సింగరేణి సంస్థ భవిష్యత్తు, కార్మికుల సంక్షేమంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.విద్యుత్ సమస్యలకు అధికారులను బాధ్యులను చేసి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోలేదని అన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించి,విద్యుత్ కోతలను తక్షణమే నివారించాలని కోరారు.ఈ సమావేశంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, డీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, తిరుపతి రావు, ఇంద్రసేన రెడ్డి, పొనగంటి సంపత్, మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మణ్ రావు, మున్సిపల్ చైర్మన్ దిలీప్, వైస్ చైర్మన్ జావీద్, కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిమ్స్‌లో గాజర్ల అశోక్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంతుల శ్రీనివాస్

**భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి:** హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్‌ను జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అశోక్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు రావాలని దొంతుల శ్రీనివాస్ ఆకాంక్షించారు.
వైద్యుల సూచనలను పాటిస్తూ మెరుగైన చికిత్స పొందాలని సూచించారు.

ఈ సందర్భంగా అశోక్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు అండగా ఉంటారని భరోసా

ఈ పరామర్శ కార్యక్రమంలో సర్పంచులు కుర్రె మల్లయ్య యాదవ్, నాంపల్లి వీరేశం, బొడ్డు తిరుపతి పాల్గొన్నారు.

# ఉస్మానియా ఆంగ్ల విభాగాధిపతిగా ప్రొఫెసర్ పరిమళ కులకర్ణి బాధ్యతల స్వీకరణ



- విభాగాధిపతిగా పదవీకాలం పూర్తి చేసిన ప్రొఫెసర్ జె. సావిత్రికి అభినందనలు

**(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి)** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగాధిపతిగా ప్రొఫెసర్ పరిమళ కులకర్ణి నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆంగ్ల విభాగ అధ్యాపకులు ఆమెకు అభినందనలు తెలియజేసి, పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

అదేవిధంగా, ఆంగ్ల విభాగాధిపతిగా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ప్రొఫెసర్ జె. సావిత్రిని అధ్యాపకులు అభినందించారు. విభాగ అభివృద్ధికి, విద్యా రంగానికి ఆమె అందించిన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆంగ్ల విభాగ ఆచార్యులు, అధ్యాపకులు ఇరువురికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పింగిళి రాకేష్ ముదిరాజ్ ఇంటికి వొడితల ప్రణవ్



- కుమారుడిని చూసి కుటుంబ సభ్యులతో ఆప్యాయ పలకరింపు

**(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)** ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిళి రాకేష్ ముదిరాజ్ నివాసానికి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ విచ్చేశారు. రాకేష్ ముదిరాజ్ కుమారుడిని చూసేందుకు వచ్చిన ఆయన కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. వారితో కొద్దిసేపు ముచ్చటించారు.
ఈ సందర్భంగా రాకేష్ ముదిరాజ్‌తో వొడితల ప్రణవ్ స్నేహపూర్వకంగా మాట్లాడారు. ఆయన వెంట వచ్చిన కాంగ్రెస్ నాయకులు సైతం రాకేష్ ముదిరాజ్ కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకుల రాకతో అక్కడ ఆత్మీయ వాతావరణం నెలకొంది.

# భక్తిశ్రద్ధలతో మహా అన్నదానం



- అమ్మవారి సేవలో ఠాకూర్ యూత్ అసోసియేషన్!
- దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా గణేష్ నగర్‌లో అన్నదాన కార్యక్రమం..
- సహకరించిన ప్రతి ఒక్కరికీ రాజేష్ ఠాకూర్ కృతజ్ఞతలు"



**(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)** పట్టణంలోని గణేష్ నగర్ 24వ వార్డులో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని ఠాకూర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగింది. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమానికి ఏఎంసీ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, సెక్రటరీ మల్లేశం, జమ్మికుంట పోస్టాఫీస్ మేనేజర్ యు. మహేందర్, జిల్లా నాయకులు దొంతుల రాజ్ కుమార్, ఠాకూర్ రాకేష్, ఠాకూర్ సచిన్, సుశాంత్‌తో పాటు పట్టణ నాయకులు, పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు భోజనాలు వడ్డించి ఆతిథ్యం అందించారు.
ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేష్ ఠాకూర్ మాట్లాడుతూ, దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు, నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు అందించిన సహకారం, ప్రోత్సాహంతోనే కార్యక్రమం విజయవంతమైందని పేర్కొన్నారు.
భవిష్యత్తులోనూ ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జి.ఎం కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు



**రామగిరి జోర్దార్ ప్రతినిధి:** బతుకమ్మ సంబురాలను పురస్కరించుకొని శుక్రవారం నాడు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జి.ఎం. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ ఆట-పాట కార్యక్రమంలో వివిధ విభాగాల మహిళా అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పూలను దేవతలుగా పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలందరూ ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండుగ అన్నారు.తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగ గొప్పతనాన్ని రాబోయే తరాలకు కూడా తెలియజేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.
ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆర్.జి-3 ఏరియా ఇంచార్జ్ సేవా అధ్యక్షురాలు శ్రీమతి వెంకటలక్ష్మీ నాగేశ్వరరావు బతుకమ్మ ఆట-పాటలో పాల్గొని మహిళా ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు.సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 06:00 గంటలకు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.కార్యక్రమంలో ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఐ ఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఫైనాన్స్ డిజియం సి.జె. సురేఖ, ఏరియా సెక్యూరిటీ అధికారి కోల శ్రీనివాస్, తో పాటు అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
శనివారం,
అక్టోబర్ 17 2026



# నడికూడ పీహెచ్‌సీలో త్వరలో
# వైద్య సేవలు ప్రారంభం



● ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు

**పరకాల,జోర్దార్ ప్రతినిధి:**హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య నూతనంగా నిర్మించిన నడికూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో
అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, ప్రజలకు త్వరితగతిన ఓపీ వైద్య సేవలు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతోసమీక్షించారు.
జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా వివిధ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది హాజరు, వైద్య సేవల నిర్వహణను పరిశీలించారు. రాయపర్తి పీహెచ్‌సీలో 25 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు గాను 11 మంది, కమలాపూర్ పీహెచ్‌సీ పరిధిలోని కనిపర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో 10 మందికి గాను 6 మంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు.
ప్రజలకు అత్యవసర వైద్యం, ఓపీ సేవలు నిరంతరాయంగా అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య, రాజకుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా, మానసిక రంగాల సేవకు మకుటం
# “అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు” అందుకున్న పోగు అశోక్



**వరంగల్- జోర్దార్ ప్రతినిధి:**“అక్షరం గుండెల్లో వెలుగులు నింపాలి… కౌన్సెలింగ్ మనస్సులకు ఊరట నివ్వాలి” అనే సంకల్పంతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, మానసిక ఆరోగ్య వికాసానికి విశేష కృషి చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ పోగు అశోక్ సేవలకు సముచిత గౌరవం లభించింది.
మాజీ రాష్ట్రపతి, భారత రత్నా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈరోజు హన్మకొండలోని రెడ్ క్రాస్ ఆడిటోరియంలో నిర్వహించిన ఘన కార్యక్రమంలో విశిష్ట అతిథుల చేతుల మీదుగా ఆయనకు ప్రతిష్టాత్మక “అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు” ప్రదానం చేశారు.ముఖ్య అతిథి డిప్యూటీ డైరెక్టర్ డిటిఓ శ్రీనివాస్ కుమార్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు దేవునూరి ఆనంద్ మరియు ఇతర అతిథిగా చేతుల మీదుగా పోగు అశోక్ అవార్డును అందుకున్నారు.
వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత పోగు అశోక్ మాట్లాడుతూ “కలాం గారు కలలు కనమన్నారు… ఆ కలలను నిజం చేసేది అక్షర శక్తి, మనోధైర్యమేనని నమ్మాను. తరగతి గదిలో విద్యార్థులకు మార్గదర్శిగా నిలుస్తూ, సమాజంలో కుంగుబాటుకు గురవుతున్న అనేకమందికి సైకాలజిస్ట్‌గా ధైర్యాన్ని నూరిపోసే భాగ్యం కలగడం నా పూర్వజన్మ సుకృతం. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. కలాం గారి ఆశయాల బాటలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, మానసిక ఆరోగ్య చైతన్యానికి నా జీవితాంతం కృషి చేస్తాను.” అని చెప్పారు.
విద్యారంగంలో బోధనా పటిమతో పాటు సైకాలజిస్ట్‌గా, తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉచిత కౌన్సెలింగ్ శిబిరాలు, మోటివేషనల్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ వేలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న పోగు అశోక్ సేవలను అతిథులు, నిర్వాహకులు కొనియాడారు. కలాం గారి ఆశయాలకు నిలువెత్తు రూపంగా నిలుస్తున్న ఆయనకు ఈ పురస్కారం దక్కడం అభినందనీయమని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, పాల్గొని అశోక్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.
ఈ సందర్భంగా అవార్డు పొందిన ఉపాధ్యాయుడు అశోకుని సెక్టోరియల్ ఆఫీసర్ కట్ల శ్రీనివాస్, సైన్స్ అధికారి సురేష్ బాబు, మండల విద్యాధికారి, పాఠశాల హెడ్మాస్టర్ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.

# శాంతినగర్ సీతారాములవారి ఆలయంలో
# దుర్గమ్మ పూజ కార్యక్రమం



**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:**జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో ఉన్న శ్రీ సీతారాములవారి దేవాలయంలో దుర్గమ్మ పూజా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తి, సేవా భావంతో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.దైవభక్తితో పాటు సేవాభావాన్ని చాటేలా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను భక్తులు అభినందించారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు
# వెంటనే పరిష్కరించాలి

● హామీలు కాదు.. స్పష్టమైన నిర్ణయం, గడువు ప్రకటించాలి
● జనసేన నాయకుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ డిమాండ్




**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి:** ప్రజారోగ్య వ్యవస్థలో ఎన్నో సంవత్సరాలుగా కీలక సేవలందిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జనసేన నాయకుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సభకు హాజరైన ఆయన ఉద్యోగుల డిమాండ్లకు మద్దతు తెలిపారు.ఉద్యోగుల సమస్యలను ఇకపై పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ సంగీత సత్యనారాయణ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు.“సేవలు మాత్రం నిరంతరం కావాలి.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి మాత్రం సమయం లేదా?” అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోందని నిలదీశారు.ఉద్యోగుల సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు వారి ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం భరోసా కల్పించాలని రాజ్‌కుమార్ కోరారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన నిర్ణయం తీసుకుని, అమలుకు నిర్దిష్ట గడువును ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# లద్నాపూ ఆర్ అండ్ ఆర్
# దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

● అమ్మవారిని దర్శించుకున్న మంథని బ్లాక్ కాంగ్రెస్ తిరుపతి యాదవ్



**రామగిరిజోర్దార్ ప్రతినిధి:**మండలంలోని పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వకీల్‌పల్లె ప్లాట్స్, లద్నాపూర్ ఫ్లాట్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి మండపాలను మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, స్థానిక సర్పంచ్ చిందం మహేష్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తొట్ల తిరుపతి యాదవ్, సర్పంచ్ చిందం మహేష్, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్లే రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క, కొమురయ్య గౌడ్‌లను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. వేద పండితులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు.
ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్న దుర్గాదేవి కమిటీ యువ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సెంటినరీ కాలనీ టౌన్ కాంగ్రెస్ నాయకులు, కమిటీ నిర్వాహకులు రొడ్డ శ్రీను, తుమ్మల అశోక్, గొర్రె కృష్ణ, రమణ రెడ్డి, రాము, వెంకటేష్, కోటేష్, రఘు, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# కొలిపాక సమ్మయ్య మనవడికి
# బండ శ్రీనివాస్ ఆశీర్వాదం



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ పట్టణంలో ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్య మనవడి బారసాల (21వ రోజు) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ హాజరై, సమ్మయ్య కుమారుడు కొలిపాక సాయి కిరణ్, కోడలు వర్షశ్రీ దంపతుల రెండో కుమారుడిని ఆశీర్వదించారు.
ఈ కార్యక్రమంలో హనుమాన్ టెంపుల్ చైర్మన్ కొలిపాక శంకర్, ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు గుడ్డేల్గుల సమ్మయ్య,
ఉపాధ్యక్షుడు పిల్లి సమ్మయ్య, కార్యదర్శి గుడ్డేల్గుల పోచయ్య, వేల్పుల రత్నం, ప్రభాకర్, సాదుల రవీందర్, కొలిపాక సారయ్య, కొండపాక శ్రీనివాస్,
ఇప్పకాయల సాగర్, తులసి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

# పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా
# తిప్పారపు తుకారాం ఏకగ్రీవ ఎన్నిక

● నియామక పత్రాలు అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్



**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:** పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి జిల్లాకు చెందిన తిప్పారపు తుకారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో నల్లగొండలోని జీఎం గార్డెన్స్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ టీఎస్ ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో జరిగిన ఎన్నికల్లో ఆయన ఈ బాధ్యతను దక్కించుకున్నారు.తిప్పారపు తుకారాం ప్రస్తుతం మోట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత పాఠశాల సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.తన ఎన్నికకు సహకరించిన పీఆర్‌టీయూ టీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణ, ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, పలువురు సీనియర్ నాయకులకు తుకారాం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తుకారాం ఎన్నిక పట్ల పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్‌లో
# ఎల్కతుర్తి మండలానికి సముచిత గుర్తింపు

● రాష్ట్ర స్థాయి బాధ్యతలకు ఏడుగురు నాయకుల ఎన్నిక

**(ఎల్కతుర్తి: జోర్దర్)**పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ ఎన్నికల్లో ఎల్కతుర్తి మండల శాఖకు సముచిత గుర్తింపు లభించింది. నల్గొండ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో ఎల్కతుర్తి మండలానికి చెందిన ఏడుగురు నాయకులు రాష్ట్ర స్థాయి బాధ్యతలకు ఎన్నికయ్యారు.రాష్ట్ర సహాధ్యక్షులుగా నరహరి రవేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస రెడ్డి, చిలుమల కుమారస్వామి, బత్తుల మురళీధర్, గార్లపాటి రాజశ్రీ, కోటగిరి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా జన్ను కోమల ఎన్నికయ్యారు.మండల శాఖ నుంచి ఏడుగురు నాయకులు రాష్ట్ర స్థాయి పదవులకు ఎన్నిక కావడం పట్ల పీఆర్‌టీయూ టీఎస్ ఎల్కతుర్తి మండల శాఖ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికైన నాయకులు ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధన, సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ ఎన్నికల ప్రక్రియకు సహకరించిన జిల్లా, రాష్ట్ర సంఘ బాధ్యులకు ఎల్కతుర్తి మండల శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎన్నికైన నాయకులందరికీ హృదయ పూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియ జేశారు.

# వైద్యశాఖలో 51 పోస్టులకు
# 2,530 దరఖాస్తులు



**హనుమకొండ,(జోర్దార్ ప్రతినిధి)** హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ కేటగిరీల్లో 51 పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌కు భారీ స్పందన లభించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య తెలిపారు.
ఈ పోస్టులకు మొత్తం 2,530 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.
పోస్టుల వారీగా స్టాఫ్ నర్సుల 12 పోస్టులకు అత్యధికంగా 922 దరఖాస్తులు, ఏఎన్‌ఎం పోస్టులకు 467, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు 364, ల్యాబ్ టెక్నీషియన్లకు 335, ఫార్మసిస్టుల పోస్టులకు 308 దరఖాస్తులు వచ్చాయి. మిగతా వైద్య, ఇతర పోస్టులకు కూడా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని డాక్టర్ అప్పయ్య పేర్కొన్నారు.

# యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా
# చేరాల రోహిత్

**కమలాపూర్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వోడితల ప్రణవ్ బాబు సూచన మేరకు, కమలాపూర్ మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేరాల రోహిత్ కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి కృష్ణారెడ్డి నియమించారు.
ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ప్రణవ్ బాబు, జక్కిడి కృష్ణారెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసాల శ్రీనివాస్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులకు రోహిత్ కృతజ్ఞతలు తెలిపారు.
మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్
# సెన్సెక్స్ 413 పాయింట్లు లాభం



భారత్ స్టాక్ మార్కెట్ వరుసగా లాభాలబాటలో సాగింది. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ 413 పాయింట్లు లాభపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 148 పాయింట్ల లాభాలు చవిచూసింది. అంతకు ముందు గురువారం స్టాక్ మార్కెట్ అత్యధికంగా 1500 పాయింట్లుపైగా లాభపడిన సంగతి తెలిసిందే. శుక్రవారం టెక్నాలజీ, ఐటీ, మెటల్ షేర్ల కొనుగోళ్లకు మద్దతు లభించడంతో మార్కెట్ లాభాలబాటలో సాగింది.
ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 413.66 పాయింట్లు (0.56 శాతం) లాభపడి, 74,729.27 వద్ద ముగిసింది. అంతకుముందు ఒక దశలో 74,778.78 పాయింట్ల గరిష్టాన్ని తాకి, 765.79 పాయింట్ల స్థాయికి చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 148.80 పాయింట్ల (0.65 శాతం) లాభంతో 23,146.15 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్ మాత్రం నష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 65.74 పాయింట్లు నష్టపోగా, బీఎస్ఈ స్మాల్ క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 12.63 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యధికంగా 3.92 శాతం లాభపడింది. మరోవైపు రూపాయి స్వల్పంగా లాభపడింది.
డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.95గా ఉంది. బంగారం ఔన్స్ ధర 4,197 డాలర్లుగా ఉంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 105.61గా కొనసాగింది. ఇక, బీఎస్ఈ 30 ఇండెక్స్‌లో టెక్ మహీంద్రా అత్యధికంగా 8.45 శాతం లాభపడింది. ఆ తర్వాత టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతి ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ లాభపడ్డాయి. అయితే, బీఈఎల్, రిలయన్స్, ఐటీసీ, ఏసియన్ పెయింట్స్, ఇండిగో షేర్లు నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా ఇండిగో 2.23 శాతం నష్టపోయింది.

## జమ్మికుంటలో వైభవంగా

# గరుడ వస్త్ర సిల్క్స్ ప్రారంభం







- సినీనటి నభా నటేష్ చేతుల మీదుగా ప్రారంభం.. కొత్త వస్త్ర కలెక్షన్లకు యువతుల ఆసక్తి
- ప్రారంభోత్సవానికి తరలివచ్చిన ప్రజలు..
- కుటుంబ సమేతంగా షాపింగ్ చేయడానికి ప్రత్యేక వేదిక

**(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)**కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో గరుడ వస్త్ర సిల్క్స్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ నూతన షోరూమ్ శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. సురక్ష ఆసుపత్రి పక్కన ఏర్పాటు చేసిన ఈ వస్త్ర దుకాణాన్ని ప్రముఖ సినీనటి నభా నటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జమ్మికుంట పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నూతన వస్త్ర కలెక్షన్లు, విభిన్న డిజైన్లు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు అందుబాటులో ఉండటంతో ముఖ్యంగా యువతులు, మహిళలు ఆసక్తి కనబరిచారు.

సంప్రదాయ వస్త్రాలకు ఆధునిక ఫ్యాషన్‌ను జోడిస్తూ వినియోగదారులకు విభిన్న రకాల దుస్తులను ఒకే చోట అందించాలనే లక్ష్యంతో గరుడ వస్త్ర సిల్క్స్ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేశారు. మహిళలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే చీరలతో పాటు బనారసీ, కాంచీపురం, ధర్మవరం, గద్వాల్ వంటి ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలకు చెందిన చీరలు, వివిధ రకాల సంప్రదాయ దుస్తులు, ఆధునిక ఫ్యాషన్ వస్త్రాలను అందుబాటులో ఉంచారు. పురుషులు, చిన్నారులకు అవసరమైన దుస్తులతో పాటు కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ నచ్చేలా విభిన్న వస్త్ర శ్రేణులను ఏర్పాటు చేశారు. పండుగలు, వివాహాలు, శుభకార్యాలు, ప్రత్యేక వేడుకలతో పాటు రోజువారీ వినియోగానికి అనువైన దుస్తులు అందుబాటులో ఉండటంతో వినియోగదారులకు ఒకే చోట షాపింగ్ చేసే అవకాశం కల్పించారు. నూతన డిజైన్లు, ఆకర్షణీయమైన వస్త్ర కలెక్షన్ల కోసం యువతులు గరుడ వస్త్ర సిల్క్స్‌ను ఆశ్రయిస్తుండటం విశేషం. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ అందించిన ప్రత్యేక ఆఫర్లు సైతం వినియోగదారులను ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, భారతీయ చేనేత వారసత్వంలోని గొప్పదనాన్ని, సంప్రదాయ వస్త్రాల ప్రత్యేకతను వినియోగదారులకు పరిచయం చేయడంతో పాటు ఆధునిక ఫ్యాషన్‌కు అనుగుణమైన దుస్తులను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. నాణ్యత, ప్రామాణికత, సొగసుకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి కుటుంబానికి అనువైన వస్త్రాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జమ్మికుంట ప్రజల ఆదరణతో తమ సంస్థ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గరుడ వస్త్ర సిల్క్స్‌కు చెందిన జక్క రఘునందన్ రెడ్డి, అనంత్ రెడ్డి, జక్క శమంతకమణి, జక్క మానీషా, జక్క శ్రేయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ వేడుకలో పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, వస్త్రాభిమానులు పాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ బాల్మూర్ వెంకట్, రాష్ట్ర బీజేపీ నాయకుడు డాక్టర్ జి. మనోహర్ రెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, మున్సిపల్ చైర్మన్ మోలుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ ఎం.డి. జావీద్, కౌన్సిలర్ చందా రాజు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

గరుడ వస్త్ర సిల్క్స్ నూతన షోరూమ్ ప్రారంభంతో జమ్మికుంట పట్టణ ప్రజలకు, పరిసర గ్రామాల వినియోగదారులకు మరిన్ని వస్త్ర ఎంపికలు అందుబాటులోకి వచ్చాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. నాణ్యమైన వస్త్రాలు, కొత్త డిజైన్లు, కుటుంబ సమేతంగా షాపింగ్ చేసుకునే సౌకర్యంతో ఈ షోరూమ్ వినియోగదారులను ఆకటుకుంటుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాజీ సర్పంచ్ పొన్నగంటి మల్లయ్యకు

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రణవ్



**జమ్మికుంట,జోర్దార్ ప్రతినిధి:**జమ్మికుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొన్నగంటి మల్లయ్య 62వ జన్మదిన వేడుకల్లో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వోడితల ప్రణవ్ పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.మల్లయ్య 1995 నుంచి 2001 వరకు జమ్మికుంట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన సతీమణి పొన్నగంటి శారద కూడా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, ఎంపీటీసీగా సేవలందించారు. మల్లయ్య ఆయురారోగ్యాలతో ఉండి ఉన్నత పదవుల్లో కొనసాగాలని ప్రణవ్ ఆకాంక్షించారు.తన నివాసానికి వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రణవ్‌కు మల్లయ్య, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఆడపడుచుల హక్కులను

## కాలరాస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే

- మహిళా సంఘాల ఆగ్రహం

**(పెద్దపల్లి, జోర్దార్ ప్రతినిధి)**ప్రజాపాలనలో ఆడపడుచులకు తీవ్ర అవమానం జరుగుతోందని, వారి హక్కులను ప్రజాప్రతినిధులే కాలరాస్తున్నారని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. తల్లిదండ్రులు తమ కన్నకూతుళ్లకు రాసిస్తున్న భూమి పట్టా ప్రక్రియకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామణారావు అడ్డుతగలడం ఇప్పుడు స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది.

**తహసీల్దార్‌కు ఎమ్మెల్యే బెదిరింపులు:**

ఎమ్మెల్యే స్వగ్రామమైన ఓదెల మండలం రూపునారాయణపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబం తమ కుమార్తెల పేరిట భూమి పట్టా చేయడానికి సిద్ధమవగా, ఈ ప్రక్రియను నిలిపివేయాలంటూ ఎమ్మెల్యే విజయరామణారావు ఓదెల తహసీల్దార్‌కు ఫోన్ చేసి బెదిరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే ఒత్తిడితో రంగంలోకి దిగిన అధికారులు సదరు భూమికి సంబంధించిన స్లాట్ బుకింగ్‌ను మధ్యలోనే నిలిపివేసి, బ్రేకులు వేశారు.

**మహిళా సంఘాల తీవ్ర నిరసన:**

చట్టబద్ధంగా తల్లిదండ్రులు తమ కూతుళ్లకు ఇస్తున్న ఆస్తి హక్కును అడ్డుకోవడమే కాకుండా, ప్రభుత్వ అధికారులను బెదిరిస్తూ స్లాట్ బుకింగ్ కాకుండా చేయడంపై మహిళా సంఘాలు తీవ్రంగా ధ్వజమెత్తాయి.

ప్రజాపాలన అని చెప్పుకుంటూ మహిళల హక్కులకు భంగం కలిగిస్తున్న ఎమ్మెల్యే తీరును వారు తీవ్రంగా ఖండించారు.

బాధితులకు న్యాయం జరిగే వరకు మరియు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు తమ పోరాటం ఆపబోమని మహిళా సంఘాల నేతలు స్పష్టం చేశారు.

# ప్లేగు వ్యాధిలో అసలు ఎన్ని రకాలు ఉన్నాయి

## ఈ వ్యాధి ఎలా వస్తుంది..?



అప్పట్లో.. అంటే.. 14వ శతాబ్దంలో ఐరోపాలో కోట్లాది మంది ప్రాణాలను బలిగొన్న ప్లేగు వ్యాధి ఇప్పటికీ పూర్తిగా అంతరించిపోలేదు. అయితే, ప్రస్తుతం ఈ వ్యాధిని యాంటీబయాటిక్ మందులతో సమర్థవంతంగా నయం చేసే అవకాశం ఉంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, 1990వ దశకం నుంచి ప్లేగు బారిన పడిన వారిలో ఎక్కువ మంది ఆఫ్రికా దేశాలకు చెందినవారే.

ముఖ్యంగా కాంగో, మడగాస్కర్‌లో కేసులు అధికంగా నమోదయ్యాయి. అమెరికాలోనూ ఏటా సగటున ఏడుగురికి ఈ వ్యాధి సోకుతున్నట్లు అంచనా. అక్కడ గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ కేసులు కనిపిస్తున్నాయి.

**సైబీరియా ఘటనతో మళ్లీ తెరపైకి..**

ఇటీవల సైబీరియాలోని ప్లేగు పరిశోధనా సంస్థలో పనిచేసే ఓ ఉద్యోగిని న్యుమోనియాతో మరణించడం రష్యాలో ఆందోళనకు దారితీసింది. ఆమెకు న్యుమోనిక్ ప్లేగు సోకి మరణించినట్లు కొన్ని వార్తలు వచ్చినప్పటికీ, రష్యా అధికారులు నిర్వహించిన పరీక్షల్లో ప్లేగుకు సంబంధించిన ఆధారాలు లభించలేదని ప్రకటించారు. అయినప్పటికీ ముందుజాగ్రత్త చర్యగా పరిశోధనా సంస్థను తాత్కాలికంగా నిర్బంధించారు. సైబీరియా ప్రాంతంలో వేల సంవత్సరాలుగా ప్లేగు వ్యాధి ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. ఎలుకలు, ఇతర చిన్న క్షీరదాల్లో ఈ బ్యాక్టీరియా సహజంగా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన జంతువులపై ఉండే ఈగలు మనుషులను కుట్టడం ద్వారా సంక్రమణ జరుగుతుంది.

**ఈ బ్యాక్టీరియానే కారణం..**

యెర్సీనియా పెస్టిస్ అనే బ్యాక్టీరియా వల్ల ప్లేగు వ్యాధి వస్తుంది. ఇందులో ప్రధానంగా మూడు రకాలున్నాయి. అత్యంత సాధారణమైన బ్యూబోనిక్ ప్లేగు కారణంగా చంకలు, మెడ, తొడల మధ్య ఉండే శోషరస గ్రంథులు వాపునకు గురై తీవ్ర నొప్పి కలుగుతుంది. అకస్మాత్తుగా అధిక జ్వరం, చలి, తలనొప్పి, పొత్తికడుపు, చేతులు, కాళ్లలో నొప్పులు కూడా కనిపిస్తాయి. న్యుమోనిక్ ప్లేగు ఊపిరితిత్తులకు సోకుతుంది. సెప్టిసీమిక్ ప్లేగు రక్తప్రవాహంలోకి బ్యాక్టీరియా చేరడం వల్ల వస్తుంది. ఈ రెండు రకాల వ్యాధులకు సకాలంలో చికిత్స అందకపోతే ప్రాణాపాయం కలుగుతుంది. బ్యూబోనిక్ ప్లేగుకు చికిత్స చేయకపోతే అది ఇతర తీవ్రమైన రూపాల్లోకి మారే ప్రమాదం ఉంది.

**ఎలా వ్యాపిస్తుంది..**

వ్యాధి సోకిన జంతువుల ఈగలు కుట్టడం మాత్రమే కాకుండా, వాటి శరీర ద్రవాలతో ప్రత్యక్షంగా సంబంధం ఏర్పడినా ప్లేగు సంక్రమిస్తుంది. అందువల్ల అనారోగ్యంతో ఉన్న లేదా చనిపోయిన జంతువులను తాకేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. న్యుమోనిక్ ప్లేగు సోకిన వ్యక్తి దగ్గినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాధి వ్యాపించే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణంగా దగ్గరి ముఖాముఖి సంబంధం అవసరం. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి యాంటీబయాటిక్స్ వాడితే నయం చేయవచ్చు. ఆలస్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది. అధిక ప్రమాదం ఉన్న ప్రయోగశాల, ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి మాత్రమే ప్లేగు టీకాను ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేస్తోంది. న్యుమోనిక్ ప్లేగును నివారించడంలో టీకా ప్రభావంపై బలమైన ఆధారాలు లేవు. అమెరికాలో ప్రస్తుతం ప్లేగు టీకా అందుబాటులో లేదు

## ఎతుబార్‌పల్లిలో అంబరాన్నంటిన

## బతుకమ్మ సంబరాలు



మొయినాబాద్,రంగురంగుల పూల బతుకమ్మలు.. కళాకారుల జానపద గీతాలు.. మహిళలు, పురుషుల ఉత్సాహభరిత నృత్యాలతో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎతుబార్‌పల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.

శుక్రవారం రాత్రి గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ సర్పంచ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చింతకింది ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు.

అనంతరం గ్రామంలో బతుకమ్మ సంబరాలు అట్టహాసంగా కొనసాగాయి. బతుకమ్మ వేడుకల్లో మహిళలంతా ఒకే రకమైన చీరల్లో కనిపించాలనే ఉద్దేశంతో గ్రామంలోని మహిళలకు సర్పంచ్ చింతకింది ప్రవీణ్ రెడ్డి ఆకుపచ్చ రంగు చీరలను పంపిణీ చేశారు. మహిళలు ఆ చీరలను ధరించి వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కళాకారిణి నిర్మలా రాథోడ్ బృందం ఆలపించిన బతుకమ్మ, జానపద పాటలు వేడుకల్లో ఉత్సాహాన్ని నింపాయి.

కళాకారుల పాటలకు అనుగుణంగా మహిళలు, పురుషులు కలిసి నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గ్రామ ప్రజలంతా పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఉత్సవ ప్రాంగణం కోలాహలంగా మారింది. రాత్రి 10 గంటల వరకు వరకు వేడుకలు కొనసాగాయి. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటపాటలతో ఎతుబార్‌పల్లిలో పండుగ శోభ వెల్లివిరిసింది

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
శనివారం,
అక్టోబర్ 17 2026



# బ్యాటర్లకు బాధ్యత ఉండక్కర్లేదా.. హైదరాబాద్ టీ20 ఓటమిపై గవాస్కర్ ఫైర్..



హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20లో టీమిండియా 24 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 248 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్ల బాధ్యతారాహిత్యంగా ఆడటంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. భారీ లక్ష్యాలను ఛేదించేటప్పుడు బ్యాటింగ్ విభాగం బాధ్యత తీసుకోకపోతే జట్టుకు విజయాలు దక్కవని ఆయన స్పష్టం చేశారు. ఈ మ్యాచ్‌లో విండీస్ విజయం సాధించడంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 2-2తో సమమైంది. దీంతో అక్టోబర్ 17న బెంగళూరులో జరగనున్న ఐదో టీ20 నిర్ణయాత్మకంగా మారింది.ఛేజింగ్‌లో బ్యాటర్ల వైఫల్యంపై నిప్పులు చెరిగిన గవాస్కర్‌మ్యాచ్ అనంతరం జియోస్టార్‌తో మాట్లాడిన గవాస్కర్.. భారత జట్టు ఛేజింగ్ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. "ఈ భారత జట్టు అన్నిటికంటే ముందుగా భారీ లక్ష్యాల ఛేదనలో ఎలా ఆడాలో నేర్చుకోవాలి. బ్యాటర్లు మరింత బాధ్యతాయుతంగా ఆడాల్సిన అవసరం ఉంది. బ్యాటింగ్ యూనిట్ బాధ్యత తీసుకోకపోతే ఈ టీమిండియా విజయాలు సాధించడం కష్టం" అని ఆయన తేల్చిచెప్పారు. హైదరాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం కూడా బ్యాటర్లకు కలిసివచ్చిందని.. అలాంటి పరిస్థితుల్లో బ్యాట్‌తో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాల్సింది పోయి చేతులెత్తేశారని మండిపడ్డారు. వరల్డ్ కప్ నెగ్గిన జట్టు చూపించాల్సిన పట్టుదల ఈ మ్యాచ్‌లో పూర్తిగా లోపించిందని విమర్శించారు. అభిషేక్, ఇషాన్, శ్రేయస్‌లపై విమర్శల దాడిఈ మ్యాచ్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ కేవలం 23 బంతుల్లోనే 56 పరుగులతో మెరుపు అర్ధశతకం సాధించి భారత్‌కు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే మిగిలిన బ్యాటర్లు ఆ జోరును కొనసాగించడంలో ఘోరంగా విఫలమయ్యారని గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. "సంజూ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చినప్పటికీ మిగిలిన బ్యాటర్లు దాన్ని ఏమాత్రం సద్వినియోగం చేసుకోలేదు. అభిషేక్ శర్మ తన స్థాయికి తగని పేలవమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇషాన్ కిషన్ తెలిసీ కీమో పాల్ విసిరిన ఉచ్చులో పడ్డాడు. ఇక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సెంచరీ చేసిన తర్వాత నుంచి ఫామ్‌ను కొనసాగించలేకపోతున్నాడు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విండీస్ పేసర్ కీమో పాల్ 5 వికెట్లతో భారత మిడిలార్డర్‌ను దెబ్బకొట్టడంతో టీ223 పరుగులకే ఆలౌట్ అయింది.

యువ బౌలర్లకు వెన్నుదన్నుగా లిటిల్ మాస్టర్

# పండుగ సీజన్ వేళ బంగారం కొనేవారికి భారీ ఊరట.



బంగారం ధరలపై గుడ్ న్యూస్. పసిడి ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. గత కొద్ది రోజులుగా వరుసగా పడిపోతూ వస్తోండగా.. శుక్రవారం కూడా పతనాన్ని చవిచూశాయి. ఈ వారం ప్రారంభం నుంచి ధరలు కుప్పకూలుతూనే ఉన్నాయి. పండుగల సీజన్ క్రమంలో ఇది శుభపరిణామంగా చెప్పవచ్చు. దసరా, దీపావళి వరుస పండుగల క్రమంలో బంగారం, వెండి కొనేందుకు చాలామంది ముందడుగు వేస్తున్నారు. ఈ క్రమంలో ధరలు డౌన్ కావడం ఊరటనిచ్చే అంశంగా చెప్పవచ్చు. అక్టోబర్ 16వ తేదీన బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయనేది ఇప్పుడు చూద్దాం.నేటి బంగారం ధరలు ఇవే..

-దేశ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,47,430 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,35,140గా ట్రేడవుతోంది.

-హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,47,430గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,35,1401 వద్ద ట్రేడవుతోంది.

-విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ రేటు రూ.1,47,430గా ప్రస్తుతం ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,35,140 వద్ద కొనసాగుతోంది.

-దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,580 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,35,290గా ట్రేడవుతోంది.

-చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం ధర రూ.1,47,430 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,35,140గా ట్రేడవుతోంది.

-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,430గా కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,35,140గా ట్రేడవుతోంది.

సిల్వర్ రేట్లు ఇవే..

-చెన్నైలో కేజీ వెండి ధర రూ.2,39,900గా కొనసాగుతోండగా.. నిన్న రూ.2.40 లక్షలగా

-దేశ రాజధాని ఢిల్లీలో కిలో సిల్వర్ ధర రూ.2,29,900గా ఉండగా.. నిన్న రూ.2.30 లక్షల వద్ద కొనసాగుతోంది.

-చెన్నైలో కేజీ వెండి ధర రూ.2,39,900గా ఉండగా.. నిన్న రూ.2.40 లక్షలుగా ట్రేడవుతోంది.బెంగళూరులో కిలో వెండి ధర రూ.2,29,900 వద్ద ప్రస్తుతం కొనసాగుతోంది.

# 200 ప్లస్ టార్గెట్ వస్తే అభిషేక్ శర్మకు ఏమవుతుంది?..




భారత్, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న టీ20 సిరీస్ అత్యంత రసవత్తరంగా సాగుతోంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇరు జట్లు ప్రస్తుతం 2-2తో సమంగా నిలిచాయి. హైదరాబాద్ వేదికగా జరిగిన నాల్గో టీ20 మ్యాచ్‌లో ఆతిథ్య భారత్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన యంగ్ సంచలనం అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. సాధాం ˊఐంగా దూకుడుగా ఆడే అభిషేక్ ఈ మ్యాచ్‌లో 24 బంతులు ఎదుర్కొని కేవలం 29 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అతని స్ట్రైక్ రేట్ కేవలం 120.83 మాత్రమే ఉండటం అభిమానులను నిరాశపరిచింది.ఛేజింగ్ లో ఇబ్బంది పడుతున్న ఓపెనర్‌అభిషేక్ శర్మ కేవలం నాల్గో మ్యాచ్‌లో మాత్రమే కాకుండా, అంతర్జాతీయ కెరీర్‌లో భారత్ 200 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఛేదించాల్సిన సందర్భాలలో తీవ్రంగా తడబడ్డాడు. రికార్డులను పరిశీలిస్తే, భారీ స్కోర్లను ఛేదించే సమయాల్లో అభిషేక్ ఇప్పటివరకు ఒక్కసారీ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపో యాడు. పెద్ద లక్ష్యాల ఒత్తిడిని తట్టుకోవడంలో ఆయన ఇబ్బంది పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.భారత్ 200 పైచిలుకు పరుగులు ఛేజ్ చేసిన మ్యాచ్‌లలో అభిషేక్ శర్మ నమోదు చేసిన స్కోర్లు ఆందోళనకరంగా ఉన్నాయి. గతంలో ఈ తరహా

తాజాగా 24 బంతుల్లో 29 పరుగులు

ఈ గణాంకాలను బట్టి చూస్తే, భారీ లక్ష్యాలను ఛేదించే ఒత్తిడి సమయంలో అభిషేక్ శర్మ తన సహజమైన దూకుడును ప్రదర్శించ లేకపోతున్నాడని స్పష్టమవుతోంది. ఆఖరి మ్యాచ్‌పైనే అందరి చూపుప్రస్తుతం సిరీస్ 2-2తో సమంగా ఉన్నందున, అక్టోబర్ 17న బెంగళూరులో జరగబోయే ఐదో టీ20 మ్యాచ్ ఇరు జట్లకు అత్యంత కీలకంగా మారింది. ఈ నిర్ణయాత్మక మ్యాచ్‌లో భారత్ మళ్లీ భారీ లక్ష్యాన్ని ఛేదించా అధిగమించి ఏ విధంగా రాణిస్తారనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీపై కూడా విమర్శలు వ్యూహమవుతున్న తరుణంలో, యువ ఆటగాళ్లు ఒత్తిడిని జయించి గెలుపు అభిమానులు కోరుకుంటున్నారు.

# 20 ఏళ్ల పెట్టుబడి ప్రణాళిక.. దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి..?



భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టడం అంటే ప్రతి నెల కొంత మొత్తాన్ని సేవింగ్స్‌లోకి మళ్లించడం మాత్రమే కాదు. ఏ లక్ష్యం కోసం ఎంత డబ్బు అవసరం? ఆ డబ్బు ఎప్పుడు అవసరం? అందుకోసం ఇప్పటి నుంచి ఎంత పెట్టుబడి చేయాలి? అనే విషయాలను ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవడం చాలా ముఖ్యం. 20 ఏళ్ల వంటి దీర్ఘకాలిక ప్రణాళికలో ఈ విధానం మరింత ఉపయోగకరంగా ఉంటుంది. రాబోయే 20 ఏళ్లలో ఎదురయ్యే ప్రధాన ఆర్థిక అవసరాలను ముందుగా రాసుకోవాలి.

భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత

20 ఏళ్లకు రూపొందించే పెట్టుబడి ప్రణాళికలో.. ముందుగా భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇల్లు కొనడం, పిల్లల ఉన్నత విద్య, పిల్లల వివాహం, రిటైర్మెంట్ వంటి భారీ లక్ష్యాలను ఇందులో చేర్చాలి. ప్రతి లక్ష్యానికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని, దాన్ని సాధించాల్సిన తేదీని నిర్ణయించుకోవాలి.

అన్ని లక్ష్యాల కోసం ఒకే పెట్టుబడి బకెట్‌ను ఉపయోగించడం కంటే ఒక్కో లక్ష్యానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం మంచిది. సాధారణంగా ఏడాదిలోపు అవసరమయ్యే లక్ష్యాలను స్వల్పకాలికంగా, 1--8 ఏళ్ల మధ్య లక్ష్యాలను మధ్యకాలికంగా, 8 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ సమయం ఉన్న లక్ష్యాలను దీర్ఘకాలికంగా పరిగణించవచ్చు.

ద్రవ్యోల్బణాన్ని మర్చిపోవద్దు

ఈ రోజు ఒక లక్ష్యానికి అవసరమయ్యే మొత్తం, 10 లేదా 15 ఏళ్ల తర్వాత అదే మొత్తంగా ఉండకపోవచ్చు. విద్య, ఇల్లు, వైద్యం వంటి ఖర్చులు కాలక్రమంలో పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల భవిష్యత్ లక్ష్యాన్ని లెక్కించేటప్పుడు ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

తక్కువ కాలంలో అవసరమయ్యే డబ్బుకు స్థిరత్వం, లిక్విడిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి. మరోవైపు 15--20 ఏళ్ల తర్వాత అవసరమయ్యే డబ్బుకు మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకునేంత సమయం ఉంటుంది. కాబట్టి పెట్టుబడి ఎంపికలో లక్ష్య కాలవ్యవధి, రిస్క్ తీసుకునే సామర్థ్యం, వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. వివిధ ఆస్తి వర్గాల్లో పెట్టుబడులు విభజించడం ద్వారా రిస్క్‌ను కొంత మేర తగ్గించుకోవచ్చు, అయితే నష్టాల అవకాశాన్ని పూర్తిగా తొలగించలేం.

రిటైర్మెంట్‌కు ప్రత్యేక స్థానం

ఇల్లు, పిల్లల చదువు వంటి సమీప లక్ష్యాల మధ్య రిటైర్మెంట్ కోసం పెట్టుబడిని వాయిదా వేయకూడదు. 20 ఏళ్ల ఆర్థిక ప్రణాళికలో రిటైర్మెంట్ లక్ష్యానికి ముందుగానే స్థానం కల్పించాలి. దీర్ఘకాలిక రిటైర్మెంట్ పొదుపు కోసం కూడా ఒక ఎంపికగా పరిగణించవచ్చు.

ప్రతి ఏడాది ప్రణాళికను సమీక్షించాలి

పెట్టుబడి ఎంత రాబడి ఇచ్చిందనే దానికంటే, అది నిర్దేశించిన ఆర్థిక లక్ష్యానికి చేరువ చేస్తుందా లేదా అనేది ముఖ్యం. కనీసం ఏడాదికి ఒకసారి ప్రణాళికను సమీక్షించాలి. ఆదాయం, ఖర్చులు, కుటుంబ పరిస్థితులు లేదా ఉద్యోగంలో మార్పులు వచ్చినప్పుడు కూడా పెట్టుబడి ప్రణాళికను సవరించాలి.

ఆదాయం పెరిగినప్పుడు పెట్టుబడినీ పెంచాలి

20 ఏళ్ల ప్రణాళికను ప్రారంభించిన మొత్తంతోనే కొనసాగించాల్సిన అవసరం లేదు. ఆదాయం పెరిగే కొద్దీ పెట్టుబడిని కూడా

# 2031 వరకు కొత్త టోర్నీ లేనట్టే.. ఐసీసీకి షాకిచ్చిన బీసీసీఐ..?



క్రికెట్ క్యాలెండర్‌లో ఇప్పటికే ఉన్న అంతర్జాతీయ టోర్నమెం ట్లతో షెడ్యూల్ నిండిపోయింది. ఈ పరిస్థితుల్లో కొత్త పోటీలకు అవకాశం లేదని భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ స్పష్టం చేసినట్టు సమాచారం. దుబాయ్ లో జరిగిన ఐసీసీ క్రికెట్ ఆపరే షన్స్ వర్క్‌షాప్‌లో ఈ అంశంపై నెలల పాటు చర్చలు జరిగినా, కొత్త టోర్నమెంట్ ప్రతిపాదన లేకుండానే సమావేశం ముగి సింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆదాయాన్ని పెంచే మార్గాలపై ఐసీసీకి మెకిన్సే అండ్ కంపెనీ వ్యూహాత్మక నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. అందులో భాగంగా టీ20 ఫ్రాంచైజీ జట్లతో వరల్డ్ క్లబ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం, ఖాళీగా ఉన్న షెడ్యూల్ విండోల్లో నాలుగు దేశాల టీ20 టోర్నమెంట్లు ఏర్పాటు చేయడం వంటి ఆలోచనలు పరిశీలనకు వచ్చాయి. ఈ ప్రతిపాదనలకు మూడు ప్రధాన క్రికెట్ బోర్డులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆటగాళ్ల బిజీ షెడ్యూల్‌లో కొత్త టోర్నీలకు స్థలం లేదని అవి స్పష్టం చేశాయి. కొత్త పోటీని చేర్చాలంటే వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్ లేదా చాంపియన్స్ ట్రోఫీ వంటి ప్రస్తుత ప్రధాన టోర్నమెంట్లలో ఏదో ఒకదాన్ని తగ్గించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. అలాంటి మార్పు సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమైంది.ఇక ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్‌లో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (ఔజ)కు సంబంధించి మార్పు వచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది నుంచి డబ్ల్యూటీసీని 9 జట్లతో ఉన్న ప్రస్తుత ఫార్మాట్ నుంచి 12 జట్లకు పెంచే ఆలోచన ఉన్నట్టు సమాచారం. ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వేలను కూడా టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌లో చేర్చే అవకాశం ఉంది. దీనిపై ఐసీసీ ఇంకా అధికారిక ప్రణాళికను సభ్య బోర్డులకు పంపలేదు.2031 వరకు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ తమ ద్వైపాక్షిక షెడ్యూళ్లను ఖరారు చేసుకున్నట్టు నివేదిక పేర్కొంది. 2027 ఇంగ్లిష్ సమ్మర్‌లో తదుపరి డబ్ల్యూటీసీ యాషెస్‌తో ప్రారంభం కానుంది. 2028 ఆరంభంలో

# గ్రే మార్కెట్‌లో జియో తుఫాన్.. ఒక్కో షేరుపై రూ.212 ప్రీమియం..




భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డు సృష్టించేందుకు సిద్ధమైన జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓపై గ్రే మార్కెట్‌లో అంచనాలు భారీగా పెరిగిపోతున్నాయి. అక్టోబర్ 21న ప్రారంభం కానున్న ఈ మెగా ఐపీఓకు సంబంధించి అనధికార గ్రే మార్కెట్ ప్రీమియం అక్టోబర్ 15 నాటికి రూ.212 వద్ద స్థిరపడింది. ప్రైస్ బ్యాండ్ గరిష్ట ధర రూ.1,119తో పోలిస్తే, ప్రస్తుత ప్రీమియం ప్రకారం జియో షేరు స్టాక్ ఎక్స్ఛేంజీలలో దాదాపు రూ.1,331 వద్ద లిస్ట్ అయ్యే అవకాశం ఉందని అంచనా. అంటే లిస్టింగ్ రోజే మదుపరులకు సుమారు 18.95 శాతం లాభం వచ్చే సంకేతాలు కనిపిస్తున్నాయి.

జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ప్రైస్ బ్యాండ్‌ను ఒక్కో షేరుకు రూ.1,065 నుంచి రూ.1,119గా నిర్ణయించారు. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కనీస బిడ్ పరిమాణాన్ని 12 షేర్లుగా ఖరారు చేశారు. గరిష్ట ధర రూ.1,119 ప్రకారం చూస్తే.. ఒక లాట్ దరఖాస్తు చేసుకోవడానికి రిటైల్ మదుపరులకు రూ.13,428 పెట్టుబడి అవసరమవుతుంది. ప్రస్తుత గ్రే మార్కెట్ ధర వద్ద షేరు లిస్ట్ అయితే.. ఒక్క లాట్‌పై దాదాపు రూ.2,544 మేర లిస్టింగ్ గెయిన్ దక్కే అవకాశం ఉంటుంది. అయితే గ్రే మార్కెట్ అనేది అనధికారికమైనది కావడంతో మార్కెట్ ఒడిదుడుకులను బట్టి ఈ ప్రీమియం మారవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.రూ.30,213 కోట్ల ఫ్రెష్ ఇష్యూ..

అప్పుల విముక్తికే ప్రాధాన్యం

ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ 27 కోట్ల తాజా షేర్లను విక్రయించి మొత్తం రూ.30,213 కోట్లను సమీకరించనుంది. ఇందులో ప్రమోటర్ల వాటా విక్రయం ఏదీ లేకపోవడం వల్ల నిధులన్నీ నేరుగా కంపెనీకే చెందుతాయి. ఈ మొత్తంలో సింహభాగం అంటే రూ.27,500 కోట్లను జియో ప్లాట్‌ఫామ్స్ ప్రధాన అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రుణాల ముందస్తు లేదా పూర్తి చెల్లింపులకే కేటాయించారు. దీని ద్వారా కంపెనీ పూర్తిగా రుణ రహిత సంస్థగా అవతరించి ఆర్థికంగా

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం




## సంక్రాంతి బరిలో వెంకీ మామ, కళ్యాణ్ రామ్..
# ఫస్ట్ సింగిల్‌పై క్రేజీ అప్‌డేట్!

టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ప్రమోషన్స్ చేయడంలో ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటారు. తన సినిమాల ప్రకటనల దగ్గర నుంచి సరికొత్త ఐడియాలతో ప్రేక్షకుల్లో విపరీతమైన క్యూరియాసిటీని పెంచుతుంటారు. తాజాగా విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలయికలో ఆయన తెరకెక్కిస్తున్న భారీ క్రేజీ మల్టీస్టారర్ చిత్రం జనవరి 12న విడుదలటాలీవుడ్‌లో సంక్రాంతి సినిమాల సందడి మొదలైంది. వచ్చే ఏడాది పండుగను టార్గెట్ చేస్తూ పలువురు స్టార్ హీరోలు తమ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.ఈ సినిమా నుంచి వచ్చే అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా మ్యూజిక్‌పై అందరి దృష్టి పడింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలోని తొలి పాటను అక్టోబర్ చివర్లో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో ఫస్ట్ సింగిల్‌పై అంచనాలు పెరుగుతున్నాయి. అయితే పాట విడుదల తేదీపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. దర్శకుడు అనిల్ రావిపూడి సినిమాల్లో వినోదంతో పాటు పాటలకు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆయన గత చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'లోని పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సినిమా విడుదలకు ముందే పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు వెంకటేష్, కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్‌కు కూడా అదే తరహాలో మ్యూజిక్ బజ్ క్రియేట్ అవుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.వెంకటేష్‌కు ఫ్యామిలీ ఆడియెన్స్‌లో ఉన్న క్రేజ్, కళ్యాణ్ రామ్‌కు ఉన్న మాస్ ఇమేజ్‌ను కలిపి అనిల్ రావిపూడి ఎలాంటి కథను సిద్ధం చేశారన్న ఆసక్తి నెలకొంది. మరోవైపు కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండటంతో సినిమాపై మరిన్ని అంచనాలు ఏర్పడ్డాయి. సరదా సన్నివేశాలు, కుటుంబ భావోద్వేగాలు, వినోదాఅన్నది ఆసక్తికరంగా మారింది.వెంకటేష్‌కు ఫ్యామిలీ ఆడియెన్స్‌లో ఉన్న క్రేజ్, కళ్యాణ్ రామ్‌కు ఉన్న మాస్ ఇమేజ్‌ను కలిపి అనిల్ రావిపూడి ఎలాంటి కథను సిద్ధం చేశారన్న ఆసక్తి నెలకొంది. మరోవైపు కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిఅన్నది ఆసక్తికరంగా మారింది.వెంకటేష్‌కు ఫ్యామిలీ ఆడియెన్స్‌లో ఉన్న క్రేజ్, కళ్యాణ్ రామ్‌కు ఉన్న మాస్ ఇమేజ్‌ను కలిపి అనిల్ రావిపూడి ఎలాంటి కథను సిద్ధం చేశారన్న ఆసక్తి నెలకొంది. మరోవైపు కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండటంతో సినిమాన్లుగా నటిస్తుండటంతో సినిమాఈ మల్టీస్టారర్ నుంచి వచ్చే ఫస్ట్ సింగిల్ ఎలాంటి మ్యూజికల్ ట్రీట్ ఇవ్వనుంది.? జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం సినిమాకు ఎంతవరకు ప్లస్



# తెలుగులో దూసుకుపోతున్న కన్నడ భామ..

కన్నడలో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి.. తాజాగా టాలీవుడ్‌లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హిట్: ది థర్డ్ కేస్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది.ఈ సినిమాతో శ్రీనిధికి తెలుగులోనూ మరిన్ని అవకాశాలు వస్తాయనే అంచనాలు పెరిగాయి.అయితే ఈ సినిమా వసూళ్లు రూ.300 కోట్లకు పైగా చేరాయనే ప్రచారానికి సంబంధించి అధికారిక బాక్సాఫీస్ లెక్కలను నిర్ధారించుకోవాల్సి ఉంది. సినిమా విజయంతో శ్రీనిధి శెట్టి తదుపరి ప్రాజెక్టులపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.ఈ సినిమాతో శ్రీనిధికి తెలుగులోనూ మరిన్ని అవకాశాలు వస్తాయనే అంచనాలు పెరిగాయి.అయితే ఈ సినిమా వసూళ్లు రూ.300 కోట్లకు పైగా చేరాయనే ప్రచారానికి సంబంధించి అధికారిక బాక్సాఫీస్ లెక్కలను నిర్ధారించుకోవాల్సి ఉంది. సినిమా విజయంతో శ్రీనిధి శెట్టి తదుపరి ప్రాజెక్టులపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.శ్రీనిధి శెట్టి జొన్నలగడ్డ హీరోగా నటించిన 'తెలుసు కదా' సినిమాతోనూ ప్రేక్షకులను పలకరించింది. నీరజ కోన దర్శకత్వం వహించిన ఈ చిత్రం పర్లేదనిపించుకుంది. ఈ చిత్రం తర్వాత శ్రీనిధి చేతి నిండా సినిమాలతో దూసుకుపోతుంది. తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటూ తన మార్కెట్‌ను విస్తరించుకోవాలని ఈ బ్యూటీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.శ్రీనిధి శెట్టి జొన్నలగడ్డ హీరోగా నటించిన 'తెలుసు కదా' సినిమాతోనూ ప్రేక్షకులను పలకరించింది. నీరజ కోన దర్శకత్వం వహించిన ఈ చిత్రం పర్లేదనిపించుకుంది. ఈ చిత్రం తర్వాత శ్రీనిధి చేతి నిండా సినిమాలతో దూసుకుపోతుంది. తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటూ తన మార్కెట్‌ను విస్తరించుకోవాలని ఈ బ్యూటీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఆదర్శకుటుంబం సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాకు త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తుండగా.. వెంకటేష్ హీరోగా నటిస్తున్నాడు. 'కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి.. ఇప్పుడు తెలుగు సినిమాలపై దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఆదర్శకుటుంబం సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాకు త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తుండగా.. వెంకటేష్ హీరోగా నటిస్తున్నాడు. 'కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి.. ఇప్పుడు తెలుగు సినిమాలపై దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది.అందం, అభినయంతో ఇప్పటికే అభిమానులను సంపాదించుకున్న ఈ భామకు టాలీవుడ్‌లో మంచి అవకాశాలు లభిస్తే మరింత బిజీ అయ్యే అవకాశం ఉంది. మరి రాబోయే సినిమాలతో శ్రీనిధి శెట్టి తెలుగు ప్రేక్షకుల్లో ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటుందో చూడాలి.అందం, అవకాశం ఉంది. మరి రాబోయే సినిమాలతో శ్రీనిధి శెట్టి తెలుగు ప్రేక్షకుల్లో ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటుందో చూడాలి.

## ఈ వారం ఎలిమినేట్ అయ్యేది ఎవరో చెప్పేసిన త్రిగుణ్.. వీడియో వైరల్




బుల్లితెర ఆడియెన్స్ ఫెవరేట్ టీవీ రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 రసవత్తరంగా, ఆసక్తికరంగా సాగుతోంది. సెప్టెంబర్ 07న ప్రారంభమైన ఈ వరల్డ్ బిగ్గెస్ట్ రియాలిటీ షో ఇప్పటికే సక్సెస్ ఫుల్ గా ఐదు వారాలు పూర్తి చేసుకుంది. ఇక ఇప్పుడు ఆరో వారం కూడా ఎండింగ్ కు వచ్చేసింది. ఇక పోతే మొదటివారం చైత్ర ,చరణ్ ఎలిమినేట్ అయ్యారు.. కానీ చరణ్ కి మరో అవకాశం లభించింది. రెండవ వారం కృష్ణుడు ఎలిమినేట్ అయ్యారు. మూడవ వారం ఎలిమినేషన్ లేకపోయినా వైల్డ్ కార్డు ద్వారా అదే వారం హౌస్ లోకి అడుగుపెట్టిన మిథిలేష్ రెడ్డి బిగ్ బాస్ ఇచ్చిన క్యాష్ ప్రైజ్ తీసుకొని బయటకు వెళ్లిపోయాడు. ఇక నాలుగవ వారం సృష్టి ఎలిమినేట్ కాగా, ఐదవ వారం చరణ్, అపూర్వ ఇద్దరూ ఎలిమినేట్ అయ్యారు. ఇక ఆరో వారం ఎలిమినేషన్స్ కు సంబంధించి మొత్తం ఆరుగురు కంటెస్టెంట్స్ నామినేషన్స్ లో నిలిచారు. టెంపర్ వంశీ, రాంప్రసాద్, అమన్, శాలిని, వర్షిని, రోహిత్ ఇలా మొత్తం 6 మంది నామినేషన్స్ లిస్టులో ఉన్నారు. ప్రస్తుతం ఆన్ లైన్ ఓటింగ్ ట్రెండ్స్ ను పరిశీలిస్తే.. వర్షిని , శాలిని డేంజర్ జోన్ లో ఉన్నారు. వంశీ కూడా తక్కువ ఓట్లు పడినప్పటికీ తాజాగా జరిగిన ఎపిసోడ్ తో అతను సేవ్ అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. దీంతో వర్షిణీ, శాలినీలలో ఎవరో ఒకరు ఈవారం ఎలిమినేట్ అవ్వనున్నారు. అయితే ఇప్పుడిదే ఎలిమినేషన్ విషయంపై త్రిగుణ్ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ఇందుకు సంబంధించి ఒక వీడియో ఇప్పుడు నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది.తాజా ఎపిసోడ్ లో భాగంగా.. వర్షిణి త్రిగుణ్ వద్దకు వచ్చి.. 'అందరూ నేను ఈ వారం ఎలిమినేట్ అవుతాను అంటున్నారు. ఆల్రెడీ ఈ వారం వంశీకి సింపతి ఎపిసోడ్ పడింది. కాబట్టి నేను ఎలిమినేట్ అవుతాను' అంటూ బాధపడుతూ చెప్పింది. దీంతో త్రిగుణ్.. 'ఈ వారం వంశీకి సింపతి ఎపిసోడ్ పడింది నిజమే కానీ ఈవారం నువ్వు ఎలిమినేట్ అవ్వవు. నిన్ను సేవ్ చేసి శాలినినీ బయటకు పంపించేస్తారు. ముఖ్యంగా శాలిని హౌస్ లో ఎక్కువగా అరుస్తోంది. దీనికి తోడు ఇప్పుడు రోహిత్ కి నీతూ వచ్చింది. శాలినీని పంపించేస్తే.. గేమ్ బెటర్ అవుతుంది. గొడవలు అగుతాయి' అని చెబుతాడు. అయినా ఈ వారం నేనే

## రజనీకాంత్ 'జైలర్ 2' రిలీజ్.. నటి పూర్ణకు భారీ కటౌట్..






సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్ 2' సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాలతో రిలీజైన ఈ సినిమా మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుంది. దీంతో థియేటర్ల వద్ద రజనీ అభిమానుల హంగామా కనిపిస్తోంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన డార్క్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్ లో రజనీతో పాటు పలువురు స్టార్ యాక్టర్స్ కూడా ఉన్నారు. రమ్యకృష్ణ, శివరాజ్ కుమార్, విద్యాబాలన్, ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరమూడు, మిథున్ చక్రవర్తి, యోగిబాబు, మీర్నా మీనన్, మోహన్ లాల్, విజయ్ సేతుపతి, హృతిక్ రోషన్.. ఇలా ఎందరో స్టార్స్ జైలర్ 2లో నటించారు. అయితే ఇదే జైలర్ 2 సినిమాలో టాలీవుడ్ నటి పూర్ణ కూడా భాగమైంది. ఈ సినిమాలోని 'అలా బోలేలో' అనే పాటలో రజనీకాంత్ తో కలిసి స్టెప్పులేసింది పూర్ణ. . మాస్, క్లాసికల్ డ్యాన్స్ మిక్స్ చేసి పూర్ణ వేసిన స్టెప్పులు నెట్టింట తెగ వైరల్ అయ్యాయి. ముఖ్యంగా సంప్రదాయ కేరళ చీరకట్టులో పూర్ణ చేసిన డ్యాన్స్ హైలెట్ గా నిలిచింది. ఈ నేపథ్యంలోనే జైలర్ 2 సినిమా రిలీజ్ వేళ పూర్ణకు కటౌట్ ఏర్పాటు చేశారు ఆమె అభిమానులు. త్రివేంద్రం (తిరువనంతపురం)లోని ఓ థియేటర్ సమీపంలో షమ్నా కాసిమ్ ఫ్యాన్స్ అండ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ వారు ఈ కటౌట్ ను ఏర్పాటు చేశారు. 'జైలర్ 2' రిలీజ్ వేళ అన్ని చోట్ల రజనీకాంత్ కటౌట్లు పెట్టారు. అయితే నటి పూర్ణకు కూడా నిలువెత్తు కటౌట్ పెట్టడం ఆసక్తికరంగా మారింది. మొత్తానికి

# అనుపమ పరమేశ్వరన్‌పై క్రష్..



టాలీవుడ్‌లో తన అందంతో పాటు నటనతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తాజాగా ఈ ముద్దుగుమ్మపై తనకున్న అభిమానాన్ని ప్రముఖ పాటల రచయిత కాసర్ల శ్యామ్ ఆసక్తికరంగా వెల్లడించారు. అనుపమను మొదటిసారి చూసినప్పుడే క్రష్ ఏర్పడిందని చెబుతూ.. ఆమెను ఆరాధిస్తానంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. అనుపమ పరమేశ్వరన్, నరేష్ వీకే, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్లను చిత్ర బృందం వేగవంతం చేసింది. ఇటీవలే ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా.. తాజాగా 'క్రేజీ కల్యాణం బరాత్' పేరుతో మరో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.ఈ వేడుకకు హాజరైన ప్రముఖ లిరిసిస్ట్ కాసర్ల శ్యామ్.. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గురించి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనుపమ అంటే తనకు క్రష్ అని, ఆమెను మొదటిసారి చూసినప్పుడే మనసు పారేసుకున్నానని సరదాగా తన మనసులోని మాటను బయటపెట్టారు. అనుపమపై తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ కాసర్ల శ్యామ్ మరో ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఆమెను తాను 'అఆ' అని పిలుస్తానని చెప్పారు. ఇందులో 'అ' అంటే అనుపమ అని, 'ఆ' అంటే ఆరాధన అని వివరించారు. దీంతో ఈ కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సినీ వేడుకల్లో సెలబ్రిటీలు చేసే సరదా వ్యాఖ్యలు అప్పుడప్పుడు నెట్టింట వైరల్ అవుతుంటాయి. ఇప్పుడు కాసర్ల శ్యామ్ చేసిన వ్యాఖ్యలు కూడా అలానే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అనుపమపై తనకున్న క్రష్‌ను ఆయన వ్యక్తం చేసిన తీరు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. మరోవైపు, 'క్రేజీ కల్యాణం' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్లు కూడా అందరి అనుపమను తాను అంతలా ఆరాధిస్తానని చెబుతూ.. ఆమెకు తాను అభిమానిగా మారిపోయానని వెల్లడించారు.అంతేకాదు.. అనుపమకు నటనతో పాటు పాటలు పాడటంలోనూ మంచి ప్రతిభ ఉందని ప్రశంసించారు. ఆమె గాత్రాన్ని కూడా కాసర్ల శ్యామ్ కొనియాడారు. దీంతో ఈ కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సినీ వేడుకల్లో సెలబ్రివ్యక్తం చేసిన తీరు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. మరోవైపు, 'క్రేజీ కల్యాణం' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్లు టీలు చేసే సరదా వ్యాఖ్యలు అప్పుడప్పుడు నెట్టింట వైరల్ అవుతుంటాయి. ఇప్పుడు కాసర్ల శ్యామ్ చేసిన వ్యాఖ్యలు కూడా అలానే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అనుపమపై తనకున్న క్రష్‌ను ఆయన వ్యక్తం చేసిన తీరు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. మరోవైపు, 'క్రేజీ కల్యాణం' విడుదలకు సిద్ధమవుతున్న ఎకూడా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మరి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన 'క్రేజీ కల్యాణం' ప్రేక్షకులను ఏ మేరకు అలరిస్తుందో చూడాలి.

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224